e-paper
# ఈ -కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

సోమవారం | 10-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:48 సూర్యాస్తమయం - సా. 6:12 తిథిజి త్రయోదశి రా. 7:01 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పునర్వసు సా. 6:01 వరకు తరువాత పుష్యమి యోగం ప్రీతి ఉ. 10:27 వరకు కరణం కౌలవ ఉ. 7:08 వరకు తైతుల రా. 7:01 వరకు వర్జ్యం రా. 2:11 నుండి తె. 3:49 వరకు దుర్ముహూర్తం మ. 3:09 నుండి మ. 3:55 వరకు మ. 3:09 నుండి మ. 3:55 వరకు రాహుకాలం ఉ. 8:14 నుండి ఉ. 9:39 వరకు యమగండం ఉ. 11:05 నుండి మ. 12:30 వరకు గుళికాకాలం మ. 1:55 నుండి మ. 3:21 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:12 నుండి ఉ. 6:00 వరకు అమృత ఘడియలు మ. 3:34 నుండి సా. 5:10 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు

## హద్దులు మీరినా నో ఛాన్స్..
కారణాలు చెప్పిన మృణాల్ ఠాకూర్
సినీ కబుర్లు






## తెలంగాణను ప్రపంచంలో అత్యుత్తంగా
# తీర్చిదిద్దాలనుకుంటున్నాం

### దక్షిణాది రాష్ట్రాలు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం చేతులు కలపాలని పిలుపు



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళలోని తిరువనంతపురంలో జరుగుతున్న మాతృభూమి ఇంటర్-నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను ప్రపంచంలో అత్యుత్తంగా తీర్చిదిద్దాలనుకుంటున్నామని అన్నారు.

- మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్‌లో సీఎం రేవంత్
- తెలంగాణను ప్రపంచంలో అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యం
- సుపరిపాలనలో తెలంగాణను ఆదర్శంగా నిలిపే దిశగా చర్యలు
- తెలంగాణ రైజింగ్ ప్రజల కల సాకారం చేసేందుకు కార్యాచరణ
- 2035 నాటికి తెలంగాణ జీడీపీని ఒక బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యం
- హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే ప్రణాళికలు
- ఫ్యూచర్ సిటీ - 30 వేల ఎకరాల్లో నూతన హరిత నగరం నిర్మాణం
- హైదరాబాద్ పర్యావరణ సుస్థిరత కోసం మూసీ నదీ పునరుద్ధరణ
- గోదావరి నీటితో మూసీని త్రివేణి సంగమంగా మార్చే ప్రణాళిక
- 200 ఎకరాల్లో గాంధీ సరోవర్ నిర్మాణంపై సీఎం రేవంత్ ప్రకటన

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 09 : సుపరిపాలన ఏడాదిలో ఎంత మార్పు తెస్తుందనేకు తెలంగాణ ప్రభుత్వం ఒక ఉదాహరణ అని అన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన గ్యారంటీలను, మన హక్కులను రక్షించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అలాగే తెలంగాణ రైజింగ్ అనేది కేవలం ఒక నినాదం మాత్రమే కాదని.. అది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల స్వప్నమని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణ రైజింగ్.. విజన్ -2050.. దక్షిణాది రాష్ట్రాలు ఎందుకు కలిసి పని చేయాలనే దానిపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కలను నెరవేర్చినందున తెలంగాణ ప్రజలు సోనియా గాంధీని ఎంతగానో ప్రేమిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ జీడీపీ సుమారు (మిగతా 2 వ పేజీలో)

# గల్లా పట్టి నిలదీయండి..

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు

- కాంగ్రెస్ పాలనలో భ్రష్టు పట్టిన విద్యా వ్యవస్థ
- స్కూళ్లలో చాక్ పీసులకు పైసల్లేవ్..విద్యాశాఖకు మంత్రి లేరు
- అర్బన్ నక్సల్స్ చేతిలో విద్యా వ్యవస్థ బంధీ అయ్యింది
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను చిత్తుగా ఓడించండి
- ఒవైసీ, రేవంత్ గ్యాంగ్ కలిసి బీసీలను దెబ్బతీసే కుట్ర చేస్తున్నాయి
- ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ కు ఎందుకు ఓటేయాలి?
- ఓట్ల కోసం మీ వద్దకు వస్తే హామీలేమయ్యాయని గల్లా పట్టి నీలదీయండి
- జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలోనే ఈ కుట్రను అడ్డుకోకపోవడంవల్లే ఈ దుస్థితి
- మీకోసం పోరాడుతున్న బీజేపీకి, మీ సంక్షేమం కోసం పనిచేస్తున్న మోదీకి మద్దతివ్వండి
- నల్లగొండ జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాలకు హాజరై దిశానిర్దేశం చేసిన సంజయ్

"బీసీ జాబితాలో ముస్లింలను ఎట్లా కలుపుతారు? మీ జాతి ఏందన్నా.... మీ అయ్య జాగీరనుకుంటున్నారా? మేం బొట్టు పెట్టుకుంటాం. మాకు జన్మ నక్షత్రం ఉంటుంది. గోత్రనామాలుంటాయి. మొలదారం కట్టుకుంటాం. ఇది మా జాతి. ఒక జాతికి, ఇంకో జాతికి తేడా తెలుసుకోలేని మూరత్వపు పార్టీ కాంగ్రెస్. అసలు హిందువులకు, ముస్లింలకు పోలికేమిటి? హిందువులు అడుక్కోవాలా? బిచ్చగాళ్లను చేద్దామనుకుంటున్నారా?" అంటూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు.



**ఈ-కబురు, హైదరాబాద్**

అసలు బీసీ సంఘాలు ఏం చేస్తున్నాయి? ఎవరు అధికారంలో ఉంటే వాళ్లకు వత్తాసు పలుకుతారా? అంటూ మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేస్తారు? వారి ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేసి హిందువులకు అన్యాయం చేసినప్పుడు హిందుత్వ వాదులు, బీసీ సంఘాలు స్పందించకపోవడంవల్లే ఈరోజు ఒవైసీ, రేవంత్ గ్యాంగ్ కలిసి బీసీలను దెబ్బతీయాలని ముస్లింలను బీసీ జాబితాలో కలిపే కుట్రకు తెరదీశాయన్నారు. అగ్రకులాల ప్రజలు కూడా బీసీలకు జరిగిన (మిగతా 2 వ పేజీలో)



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

రైతుల బోనస్‌పై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర విమర్శ 2


2

### భీకర ఎన్‌కౌంటర్‌పై
## అమిత్‌షా ప్రకటన

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్, 31 మంది మావోయిస్టుల మృతి
- నక్సల్స్ రహిత దేశంగా మార్చేందుకు భద్రతా దళాల విజయవంతమైన ఆపరేషన్
- 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని అమిత్ షా
- భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు వీరమరణం, గాయపడిన ఇద్దరికి చికిత్స


4

### జీసీసీలతో 4.5 లక్షల
## కొత్త కొలువులు
2030 నాటికి పరిశ్రమలో 33 లక్షల మంది నిపుణులు


6

### జిల్లాకు రూ. 1 కోటి
## చొప్పున...
అభివృద్ధి నిధులు ఇవ్వనున్న హెచ్‌సీఏ

# కులగణన తప్పులతడక, అశాస్త్రీయం..

- బీసీలకు అన్యాయం జరగకుండా రీసర్వే చేయాలని డిమాండ్
- బలహీన వర్గాల గణనలో అక్రమాలు, ఐదున్నర శాతం జనాభా తక్కువగా చూపించారని విమర్శ
- 42% రిజర్వేషన్ వాగ్దానం నిలబెట్టుకోవాలని కేటీఆర్ డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లో బీసీలకు కనీసం 15 పైసలు కూడా కేటాయించలేదని ఆరోపణ
- బీసీ సంఘాలు, కాంగ్రెస్ ఎమ్మెల్సీలే కులగణనను చిత్తుకాగితంగా తగులబెట్టారని విమర్శ
- రీసర్వే చేయించాలని, ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని బీసీ నేతలతో సమావేశంలో కేటీఆర్ డిమాండ్



ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పులతడక, అశాస్త్రీయం, అర్థరహితం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 09 : బీసీలకు అన్యాయం చేయకుండా.. రీసర్వే చేయాలని రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో బీసీ నేతలతో సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మొన్న రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల గొంతు కోస్తూ, వారి సంఖ్యను దాదాపు ఐదున్నర శాతానికి తక్కువ చేసి (మిగతా 2 వ పేజీలో)


2

### గ్రేటర్‌ఎన్నికల్లో
## మజ్లిస్ కోరలు
# పీకేయాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్పొరేటర్లకు కిషన్ రెడ్డి పిలుపు
- జీహెచ్ఎంసీ సమస్యలపై దృష్టి పెట్టాలని, ప్రజలకు పరిష్కారం చూపాలని సూచనలు
- స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వ్యూహాలపై దిశానిర్దేశం
- గ్రేటర్ ఎన్నికల్లో మేయర్ పీఠం సాధించేందుకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని కిషన్ రెడ్డి సూచన

# గ్రేటర్ ఎన్నికల్లో మజ్లిస్ కోరలు పీకేయాలి

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 09 : నగర కార్పొరేటర్లు త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు చోట్ల నిలిచిన అభ్యర్థులు విజయం సాధించేలా బాధ్యతలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. తమ పరిధిలో ఉన్న సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టి ప్రజలకు పరిష్కారం చూపేలా పాటు పడాలని, స్టాండింగ్‌కమిటీ ఎన్నికల్లో ఏవిధంగా వ్యవహరించాలనే అంశాలను వారికి వివరించారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీలో నెలకొన్న సమస్యలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం, స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ ఏ కార్యక్రమం తలపెట్టిన తమ పరిధిలో విజయవంతం అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని అదే విధంగా కార్యకర్తలందరిని ఏకతాటిపై నడిపించి వచ్చే ఏడాదిలో జరిగే గ్రేటర్ ఎన్నికల్లో మేయర్‌పీఠం సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. వచ్చే శాసనసభ ఎన్నికలకు ముందే సిద్ధంగా ఉండాలని, దానికంటే ముందు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలుంటాయని, ఈ ఎన్నికల్లో అహంకారపూరిత మజ్లిస్ పార్టీ కోరలు పీకి కాషాయ



జెండా ఎగురవేయాలని సూచించారు. ఈసారి జీహెచ్ఎంసీలో 100కు వందసీట్లు గెలిపించుకునేలా బీజేపీ శ్రేణులు కృషిచేయాలని కోరారు.

### 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో బీజేపీ విజయం

ప్రజలను విభజించి, మోసపూరిత హామీలిచ్చి, చివరకు లిక్కర్ కుంభకోణానికి పాల్పడ్డ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ను ఓడించి పాతరేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బీజేపీసెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా లంకాల దీపక్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వరుసగా అనేక రాష్ట్రాల్లో బిజెపి విజయదుందుభి మోగిస్తోంద ని, ఉత్తరప్రదేశ్‌లో రెండోసారి, మధ్యప్రదేశ్‌లో మూడో సారి, గుజరాత్‌లో ఆరోసారి, గోవాలో మూడోసారి అధికారంలోకి వచ్చామన్నారు. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించి, కాషాయ జెండా రెపరెపలాడించేలా మోదీ పాలన అందిస్తున్నారు. పాకిస్తాన్, బంగ్లదేశ్ తో పాటు అమెరికా, యూకే, శ్రీలంక వంటి దేశాల్లో ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని, మన దేశంలో మోదీ నాయకత్వంలో స్థిరమైన ఆర్థిక వ్యవస్థతో దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక దేశంగా భారత్ ఐదో స్థానంలో ఉందని, ప్రపంచంలో ఏ సమస్య వచ్చినా పరిష్కారం కోసం మన దేశ వైపు చూస్తున్నారు. ఇటీవల హర్యానాలో, తాజాగా ఢిల్లీలో తమ పార్టీని గెలిపించిందని, ప్రధాని మోదీపై విశ్వాసంతో బిజెపిని ఆదరిస్తున్నారు. ఇక మిగిలింది మన తెలంగాణ రాష్ట్రమేనని, ఇక్కడ కూడా డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని, గత బీఆర్ఎస్ కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకుంది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు అనేక రకాల హామిలిచ్చి, ఏ ఒక్క హామీని అమలు చేయకుండా వైఫల్యం చెందిందని విమర్శించారు. బిజెపిలో ప్రస్తుతం సంస్థాగత పర్వం కొనసాగుతోందని, దీపక్ నేతృత్వంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలో బిజెపిని ముందుకు తీసుకెళ్లాలని, అందుకు అందరు సహకరించాలని పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

**ఈ-కబురు,సిద్దిపేట**

ఫిబ్రవరి 09 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే మరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. సన్నవడ్లు అమ్ముకొని రెండు నెలలైనా రైతులకు బోనస్ డబ్బులు ఇవ్వడం లేదు అని హరీశ్ రావు మండిపడ్డారు. అన్ని పంటలకు బోనస్ అన్న మాటలను బోగస్ చేసింది రేవంత్ సర్కార్ అని తీవ్రంగా విమర్శించారు.వరంగల్ రైతు డిక్లరేషన్ తుంగులో తొక్కారు. రుణమాఫీ, రైతు భరోసా, వడ్ల పైసలు కూడా ఇవ్వలేదు రెండో పంట ఎలా వేస్తారు..? రాష్ట్రంలో ఇంకా రూ. 432 కోట్ల బోనస్ బకాయిలు ఉన్నవి. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు ఉత్తర కుమార ప్రగల్బాలు అయినవి. చేతకాని మాటలు ఎందుకు మాట్లాడతావు. పొద్దున లేస్తే బీఆర్ఎస్‌పైన ఎందుకు మాట్లాడతావ్. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు పాలాభిషేకం చేయాలి అని హరీశ్‌రావు ప్రశ్నించారు.రైతు కందులు పండిస్తే మూడు క్వింటాల్లే కొంటున్నారు. కంది రైతుల మీద ఎందుకు పగ మీకు. క్రాప్ బుకింగ్‌లో మిస్సింగ్ అయిన రైతులకు అనుమతి ఇవ్వండి. రేవంత్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుని డిమాండ్ చేస్తున్న.. రైతు పండించిన మొత్తం కందులను కొనుగోలు చేయడానికి ఆదేశాలు ఇవ్వాలి. విదేశాల నుంచి నూనెలను దిగుమతి చేసుకోవడం వలన విదేశీ మారక ద్రవ్యం తరిగిపోతుంది. పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలే. కాంగ్రెస్ కోతల ప్రభుత్వం అని హరీశ్‌రావు మండిపడ్డారు.ఓ రైతుకు 31 గంటలకు భూమి ఉంటే రూ. 1650 మాత్రమే రైతు బంధు పడతాయా..? సీఎం రూ. 250 కోట్ల చెక్కు ఎందుకు పడడం లేదు.. ఉత్తుత్తి చెక్కు



ఇచ్చినవా..? కొత్త పాస్ బుక్ వచ్చిన వాళ్లకు రైతుబంధు పడడం లేదు. ప్రభుత్వం మోసం చేసింది అని గ్రామాలలో మాట్లాడుకుంటున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలు చూస్తున్నారు. కాంగ్రెస్ తవ్వుకున్న గ్యారంటీల సమాధిలో సమాధి అవుతుంది. ఇక్కడ ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీని గాలిలో కలపడానికి సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీది జగమంతా పాలన, కాంగ్రెస్ పార్టీది సగమంత పాలన. మాది అసలు పాలన మీది కొసరు పాలన. సంతృప్తి, సంక్షేమం బీఆర్ఎస్ పాలన.. సంక్షోభం, అసంతృప్తి అసహనం కాంగ్రెస్ విధానం అని హరీశ్‌రావు మండిపడ్డారు.

# గల్లా పట్టి నిలదీయండి..

(మొదటి పేజీ తరువాయి)

అన్యాయంపై సానుభూతి తెలుపుతుంటే... బీసీ సంఘాలు ఎందుకు నోరు మూసుకున్నాయని మండిపడ్డారు. బీసీలతోపాటు హిందువులంతా ఏకమై కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అధికారం చెలాయిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నేతలను హామీలెందుకు అమలు చేయలేదో నిలదీస్తూ గల్లాపట్టి అడగాలని పట్టభద్రులు, టీచర్లకు పిలుపునిచ్చారు.

> **ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఈరోజు నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాలలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపైన, బీసీ సంఘాల తీరుపైన నిప్పులు చెరిగారు.**

ఏమన్నారంటే...ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సరైన అభ్యర్థులే కరువయ్యారు. దేశ చరిత్రలో అధికార పార్టీకి మంచి అభ్యర్థులు కరువైపోవడం విచిత్రంగా ఉంది. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటైనయ్. ఆ రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరింది. కాళేశ్వరం, డ్రగ్స్, ఫార్ములా ఈ రేస్ సహా పలు అవినీతి కేసుల్లో ఇరుక్కుపోయిన బీఆర్ఎస్ నేతలు అరెస్ట్ కాకుండా రక్షించేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని, అందుకు ప్రతిఫలంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టకుండా కాంగ్రెస్ ను గెలిపించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తోంది. రెండు పార్టీలు కలిసి బీజేపీని గెలవనీయకూడదని కుట్ర పన్నాయి. రెండు పార్టీల మధ్య ఒప్పందం లేకపోతే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. నేనడుగుతున్నా.... కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేయాలి? నిరుద్యోగ భృతి 4 వేల రూపాయలిస్తామన్నారు. 14 నెలలైంది. ఈ లెక్కన ప్రతి నిరుద్యోగికి కాంగ్రెస్ 56 వేల రూపాయలు బాకీ పడింది. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను గల్లా పట్టి 14 నెలల బకాయి ఇవ్వాలని నిలదీయండి.తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

> **కేవలం 25 వేల ఉద్యోగాలకే నోటిఫికేషన్ ఇచ్చి 50 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని దుష్ప్రచారం చేసుకున్నారు. మీ వద్దకు వచ్చే కాంగ్రెస్ నేతలను 2 లక్షల ఉద్యోగలేమయ్యాయని నిలదీయండి. 18 ఏళ్లు నిండి చదువుకునే ప్రతి మహిళకు స్కూటీ ఇస్తామన్నారు. ఒక్కటీ ఇవ్వలేదు. డిగ్రీ ఆపై చదువుకున్న మహిళలంతా మీ వద్దకు ఓట్లు అడగానికి వచ్చే కాంగ్రెస్ నేతలను స్కూటీ ఏమైందని నిలదీయండి.**




విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు ఇస్తామన్నరు. ఓట్ల కోసం వచ్చే సీఎం, మంత్రులను భరోసా కార్డు ఎందుకివ్వలేదో, ఎప్పుడిస్తరో సమా ధానం చెప్పాలని నిలదీయండి...ఫీజు రీయంబర్స్ మెంట్ అందక లక్షలాది మంది విద్యార్థులు అల్లాడుతున్నరు.కాలేజీలు మూతపడుతున్నయ్. పైసలివ్వనిదే సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు లేకుండా ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలిచ్చే పరిస్థితి లేకపోవడతో విద్యార్థులంతా అల్లాడుతున్నరు. ఓట్ల కోసం మీ వద్దకొచ్చే కాంగ్రెస్ నేతలను మా భవిష్యత్తును దెబ్బ తీయడానికి మీరెవ్వరని నిలదీయండి...ఉద్యోగ, ఉపాధ్యాయులను నిండా ముంచుతున్న ప్రభుత్వం కాంగ్రెస్. రెండో పీఆర్సీ నివేదిక తెప్పించుకోకుండా, అమలు చేయకుండా గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ఉద్యోగులను దారుణంగా మోసం చేసిందని చెప్పాలి.ఉద్యోగులకు 5 డి ఏ లు ఇవ్వకుండా తాత్సారం చేస్తోంది.2023 మార్చి నుండి రిటైర్ అయిన ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు ఇప్పటివరకు ఏ ఒక్కరికి కూడా అందించ లేదు. డబ్బులివ్వలేక ఉద్యోగుల రిటైర్‌మెంట్ కాలాన్ని 65 ఏళ్ల కాలానికి పెంచారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇట్లనే చేసింది.కాంగ్రెస్ అదే బాటలో నడుస్తూ ఉద్యోగాల కోసం వేచి చూస్తున్న యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది.ఆఖరుకు ఉపాధ్యాయులు,ఉద్యోగులు జీపీఎఫ్ లో తాము దాచుకున్న సొమ్మును, కూడా ఇవ్వకుండా నెలల తరబడి సతాయిస్తూ వాళ్ల ఉసురు తీస్తోంది. ఉద్యోగులు తమ ఆరోగ్యం దృష్ట్యానో ,కుటుంబ అవసరాల దృష్ట్యానో ,పిల్లల పెళ్లిళ్ల కోసమో జిపిఎఫ్ లో దాచుకున్న వారి డబ్బులను వారే విత్ డ్రా చేసుకుందాం అంటే చెల్లించలేని అసమర్థత స్థితిలో ఉన్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఓటేయాలి?విద్యా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైపోయింది. రెగ్యులర్ ఎంఈఓలు, డిప్యూటీఈవోలు, రెగ్యులర్ డిఇవోలు లేక పర్యవేక్షణ లేక పాఠశాలలు దారుణంగా తయారయ్యాయి. సమీక్షలు లేవు.చదువు లేదు..అజమాయిషీ లేదు.. స్కూళ్లలో చాక్ పీసులకు పైసల్లేవ్.. టాయిలెట్లు కడగడానికి స్కావెంజర్లు లేరు... ఆఖరికి విద్యాశాఖకు మంత్రి కూడా లేరు.అట్లాంటి పార్టీకి ఓటెందుకు వేయాలో చెప్పాలని నిలదీయండి...ఇవన్ని అడుగుతుంటే కుల గణన పేరుతో బీసీ జనాభాను తగ్గించే కుట్రకు తెరదీశారు. కేసీఆర్ సర్కార్ చేసిన ఎస్కేఎస్ సర్వేలో 51 శాతం బీసీల జనాభా ఉంటే.... రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన కుల గణన సర్వేలో 46 శాతానికి ఎట్లా పడిపోయినట్లు? ఎన్నికల సంఘం రాష్ట్రంలో 3.35 కోట్ల మంది ఓటర్లున్నారని చెబుతోంది. రేవంత్ సర్కార్ మాత్రం 3.7 కోట్ల మంది జనాభా మాత్రమే ఉన్నారని చెబుతోంది. మేధావులు, గణాంకాలు మాత్రం రాష్ట్ర జనాభా 4.3 కోట్లుందని అంటున్నారు.ఈ లెక్కన 60 లక్షల మంది ఎటుపోయినట్లు? కాంగ్రెస్ చంపేసిందా? పైగా బీసీ జాబితాలో ముస్లింలను ఎట్లా కలుపుతారు? మీ అయ్య జాగీరనుకుంటున్నారా? మీ జాతి ఏందన్నా..మీ అయ్య జాగీరనుకుంటున్నారా? మేం బొట్టు పెట్టుకుంటాం. మాకు జన్మ నక్షత్రం ఉంటుంది. గోత్రనామాలుంటాయి.మొలదారం కట్టుకుంటాం.ఇది మా జాతి. ఒక జాతికి, ఇంకో జాతికి తేడా తెలుసుకోలేని మూర్ఖత్వపు పార్టీ కాంగ్రెస్. అసలు హిందువులకు, ముస్లింలకు పోలికేమిటి? హిందువులు అడుక్కో వాలా? బిచ్చగాళ్లను చేద్దామనుకుంటున్నారా అసలు బీసీ సంఘాలు ఏం చేస్తున్నాయి? ఎవరు అధికారం లో ఉంటే వాళ్లకు వత్తాసు పలుకుతారా? అంటూ మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేస్తారు? వారి ఆధిపత్యమే కొనసాగుతుంది.

> **తెలంగాణకే కేంద్ర బడ్జెట్ లో అన్యాయం చేసిందని, నిధులు కేటాయించాలనే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. గత 11 ఏళ్లలో కేంద్రం తెలంగాణకు కేటాయించిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధం. అట్లాగే తెలంగాణలోని గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులపై చర్చకు సిద్ధమా? శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా? చెప్పాలి...**

# భీకర ఎన్‌కౌంటర్‌పై అమిత్‌షా ప్రకటన

**ఈ-కబురు,ఢిల్లీ**



ఫిబ్రవరి 09 : ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చే దిశగా భద్రతాదళాలు భారీ విజయాన్ని సాధించాయని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి నక్సలిజాన్ని పెకిలించివేస్తామని 'ఎక్స్' వేదికగా పునరుద్ఘాటించారు."ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. అదేవిధంగా పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. మానవత్వానికి వ్యతిరేకమైన నక్సలిజాన్ని అంతం చేసే ప్రయత్నంలో ఇద్దరు జవాన్లనూ కోల్పోయాం. ఈ అమరవీరులకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది. 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామనే సంకల్పాన్ని కూడా పునరుద్ఘాటిస్తున్నాను. దేశంలోని ఏ పౌరుడూ దాని కారణంగా ప్రాణాలు కోల్పోకూడదు" అని అమిత్ షా పేర్కొన్నారు.భద్రతాబలగాల ధైర్యసాహసాలను ప్రశంసిస్తున్నట్లు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ తెలిపారు. తాము అధికారంలోకి వచ్చినప్పటినుంచి నక్సల్స్‌కు వ్యతిరేకంగా బలంగా పోరాడుతున్నట్లు మీడియాతో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. తాజా ఎదురుకాల్పుల ఘటనలో మరో ఇద్దరు జవాన్లకు గాయాలు కాగా.. వారిని రాయ్‌పుర్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే రెండో భారీ ఎన్‌కౌంటర్‌గా దీన్ని పేర్కొంటున్నారు.

# కులగణన తప్పులతడక, అశాస్త్రీయం..

(మొదటి పేజీ తరువాయి)



చూపెట్టి మోసం చేయడమే కాకుండా.. 42 శాతం రిజర్వేషన్ల వాగ్దానాన్ని తుంగలో తొక్కారు. దీనిపై మా పార్టీ తరపున అసెంబ్లీలో బలంగా నిరసన తెలియజేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన మీద ఇచ్చిన స్టేట్‌మెంట్ తప్పుల తడక, చిత్తు కాగితంతో సమానం. బలహీనవర్గాల గొంతు కోసిన కాంగ్రెస్ పార్టీ యొక్క దుర్మార్గ వైఖరిని ఏ బీసీ బిడ్డ కూడా ఒప్పుకోవడం లేదని అసెంబ్లీలో గట్టిగా ప్రభుత్వానికి డిమాండ్ చేశాం. ఇది శుద్ధ తప్పు.. బీసీ జనాభాను తగ్గించి చూపెట్టి, బలహీన వర్గాలను తక్కువ చేసి చూపిస్తున్నారని నిరసన తెలిపాం. నెల రోజుల పాటు శాస్త్రీయంగా రీ సర్వే చేయాలని డిమాండ్ చేశామని కేటీఆర్ తెలిపారు.మా సంఖ్య తక్కువ చేయడంతో రేషన్ కార్డుల జారీ, ఇతర సంక్షేమ పథకాల్లో మా వాటా తగ్గుతది.. అన్యాయం జరుగుతదని బీసీ, ఎంబీసీ బిడ్డలు ఆందోళన పడుతున్నారు. దీంతో వెంటనే తిరిగి సర్వే చేయాలని కోరాం. కానీ దున్నపోతు మీద వాన పడ్డట్టు ప్రభుత్వం ఈ రోజు వరకు స్పందించలేదు. ఇంకా సిగ్గు లేకుండా.. కుటుంబ సర్వే మీద అనుమానాలు లేవనెత్తే విధంగా కాంగ్రెస్ పెద్దలు మాట్లాడుతూ బీసీలను అవమానిస్తున్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను ఆహ్వానించి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట వాగ్దానాలు గుప్పించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పింది. అలాగే ఈ రాష్ట్రంలో రాబోయే ఐదేండ్లలో లక్ష కోట్ల బడ్జెట్ పెడుతాం అని చెప్పింది. బీసీ సబ్ ప్లాన్ తీసుకువస్తాం. ప్రభుత్వం కాంట్రాక్టుల్లో 42 శాతం బీసీలకు ఇస్తామని చెప్పింది. 15 నెలలు అవుతున్నా కనీసం 15 పైసలు కూడా బీసీలకు కేటాయించలేదు. 16 కార్పొరేషన్లు బీసీ కులాలకు ఏర్పాటు చేసి ఒక్కో కార్పొరేషన్‌కు 50 కోట్ల బడ్జెట్ అని చెప్పారు. కనీసం 50 పైసలు కూడా ఖర్చు పెట్టలేదు అని కేటీఆర్ తెలిపారు.బీసీలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఐదున్నర శాతం జనాభా తగ్గించి.. రేవంత్ రెడ్డి దుర్మార్గ చర్యకు పూనుకున్నాడు. కులగణన పూర్తి తప్పులతడక.. అశాస్త్రీయం, అర్థరహితం అని మేం అనట్లేదు.. రాష్ట్రంలో బీసీ సంఘాలు, కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇది చిత్తు కాగితంతో సమానం అని తగులబెట్టిండు. కాబట్టి రీసర్వేకు ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నాం. సరైన లెక్కలు తేల్చండి.. రీసర్వేకు మేం అందరం కూడా సహకరిస్తాం.. కోరిన అన్ని వివరాలు ఇస్తాం. బీసీలకు అన్యాయం చేయొద్దు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న మాట నిలబెట్టుకోవాలి. మొన్న అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తారని, 42 శాతం బిల్లు తెస్తామని అనుకున్నాం.. బిల్లు తేకుండా కేవలం సొల్లు తెచ్చావు. సొల్లు మాటలు ఆపి 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు తీసుకురావాలని రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## తెలంగాణను ప్రపంచంలో అత్యుత్తంగా

# తీర్చిదిద్దాలనుకుంటున్నాం

(మొదటి పేజీ తరువాయి)



200 మిలియన్ యూఎస్ డాలర్లుగా ఉందని.. 2035 నాటికి దానిని ఒక బిలియన్ యూఎస్ డాలర్లుగా మార్చాలనుకుంటున్నామని అన్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అనే మూడు జోన్లుగా విభజించామని అన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు మేం పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దేశంలోని ముంబయి, ఢిల్లీ, బెంగళూర్, చెన్నై వంటి నగరాలతో కాకుండా ప్రపంచంలోని ముఖ్య నగరాలైన న్యూయార్క్, లండన్, సింగపూర్, టోక్యో, సియోల్ వంటి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్ ఉండాలనుకుంటున్నామని ఈ సమావేశంలో రేవంత్ చెప్పుకొచ్చారు.అలాగే 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నామని.. ఇది భారతదేశంలోని పూర్తి హరిత, పరిశుభ్రమైన, అత్యుత్తమమైన నగరంగా ఉండనుంది. ప్రపంచంలోని మరే నగరంతో పోల్చుకున్నా ఇది సరైన ప్రణాళిక, జోన్లు ఉన్న నగరంగా ఉండనుందిని.. ఇది మొట్టమొదటి నెట్ జీరో సిటీ కానుందని సీఎం రేవంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీలో సిటీని నిర్మిస్తున్నామని, యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మిస్తున్నామని గుర్తు చేశారు. హైదరాబాద్ పర్యావరణ సుస్థిరతకుగానూ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టామని, గత యాభై ఏళ్లుగా కాలుష్యం కోరల్లో చిక్కి మూసీ కనుమరుగయ్యే స్థితికి చేరిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీకి పూర్వ వైభవం తేవాలనుకుంటోందని గోదావరి నీటిని మూసీలో కలపడం ద్వారా త్రివేణి సంగమంగా ఏర్పడుతుందని.. అక్కడే 200 ఎకరాల్లో గాంధీ సరోవర్‌ను నిర్మిస్తున్నామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.



## వెస్ట్ బెంగాల్‌లో అనుమానాస్పద
# రేడియో సిగ్నళ్లు
## ..ఉగ్రవాదుల పనే..?

**ఈ-కబురు,కోల్‌కతా**

ఫిబ్రవరి 09 : పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల అనుమానాస్పద రేడియో సంకేతాలను గుర్తించారు. ఇవి దేశంలో త్వరలో జరగబోయే ఉగ్రదాడులకు సంబంధించిన సంకేతాలేనని అమెచ్యూర్ హామ్ రేడియో సంస్థ అనుమానం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్ యాసలో ఉర్దూ,బెంగాలీ,అరబిక్ కోడ్ భాషల్లో అనుమానాస్పద రేడియో సిగ్నళ్లను గత రెండు నెలలుగా తమ ఆపరేటర్లు గుర్తించారని తెలిపింది.పశ్చిమ బెంగాల్‌తో సరిహద్దులున్న బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు నెలకొనడం, ఇదే సమయంలో పాకిస్తాన్‌తో బంగ్లాదేశ్ అధికారులు సన్నిహితంగా ఉండడం వంటి పరిస్థితుల నేపథ్యంలో అనుమానాస్పద రేడియో సిగ్నళ్లు ఆందోళన కలిగిస్తున్నాయి. మళ్లీ ఇటువంటి సిగ్నల్స్ వస్తే తమకు తెలియజేయాని రేడియో ఆపరేటర్లకు పోలీసులు సూచించారు.

గతేడాది డిసెంబర్‌లో ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బసిర్‌హట్, బొంగావ్,దక్షిణ 24 పరగణాలలోని సుందర్‌బన్స్ ప్రాంతాల నుంచిఉర్దూ, అరబిక్ భాషలను వాడి వివిధ కోడ్‌లలో మాట్లాడుకుంటున్నట్లు తాము గుర్తించినట్లు హామ్ రేడియో సంస్థ అధికారులు తెలిపారు. మరికొన్ని సార్లు ఇతర భాషల్లోనూ సిగ్నల్స్ అందుతున్నాయన్నారు.అయితే, తాము తొలుత వీటిని పట్టించుకోలేదన్నారు.జనవరిలో జరిగిన గంగాసాగర్ మేళా సమయంలో వినియోగదారులు తమకు అనుమానాస్పద సంకేతాలు వినిపిస్తున్నాయని ఫిర్యాదు చేయడంతో వెంటనే అప్రమత్తమై కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.ఈ కోడ్ భాష అర్థం తెలుసుకోవడానికి కోల్‌కతాలోని ఇంటర్నేషనల్ మానిటరింగ్ స్టేషన్ (రేడియో)కి సమాచారం పంపినట్లు బీఎస్‌ఎఫ్ అధికారి పేర్కొన్నారు. స్మగ్లర్లు,తీవ్రవాద గ్రూపులు రహస్య చర్చల కోసం ఇటువంటి సంకేతాలను వినియోగించుకుంటారన్నారు. వీటిని ట్రాక్ చేయడం కష్టమయినప్పటికీ డీకోడ్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

2002-03లో కూడా ఇదే విధంగా వచ్చిన అనుమానాస్పద సంకేతాలను ట్రాక్ చేసి దక్షిణ 24 పరగణాల జిల్లాలోని గంగాసాగర్ ప్రాంతం నుంచి అక్రమ రేడియో స్టేషన్లను నిర్వహిస్తున్న ఆరుగురు తీవ్రవాదులను అదుపులోకి తీసుకున్నామన్నారు.2017లో బసిర్‌హట్‌లో మత ఘర్షణలు జరగడానికి ముందు హామ్ రేడియో వినియోగదారులు తమకు అనుమానాస్పద సంకేతాలను వినిపిస్తున్నాయని తెలిపినట్లు చెప్పారు. హామ్ రేడియో దేశ భద్రత విషయంలో అనేకసార్లు కీలక పాత్ర పోషించిందన్నారు.

# యాక్సియోమ్-4 మిషన్ వాయిదా?

### ఇంకా సిద్ధం కాని స్పేస్‌ఎక్స్ 'డ్రాగన్'స్పేస్‌క్రాఫ్ట్
### సునీతా విలియమ్స్, విల్మోర్ ఆగమనం మరింత ఆలస్యమయ్యే అవకాశం

వాషింగ్టన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) నుంచి వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భూమిపైకి తిరిగి రావడం మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఫిబ్రవరిలోనే వారిని వెనక్కి తీసుకురావాలని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా', స్పేస్‌ఎక్స్ సంస్థ తొలుత నిర్ణయించాయి. సాంకేతిక కారణాలతో మార్చి నెలకు వాయిదా వేశాయి. అది కూడా సాధ్యమయ్యే అవకాశం లేదని సైంటిస్టులు అంటున్నారు. ఐఎస్ఎస్ నుంచి ఇద్దరు వ్యోమగాములను రప్పించడానికి స్పేస్‌ఎక్స్ సిద్ధం చేస్తున్న నూతన అంతరిక్ష వాహనం 'డ్రాగన్'లో తలెత్తిన సాంకేతిక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. బ్యాటరీల్లో కొన్ని లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఎప్పటిలోగా సరి చేస్తారన్న ఎవరూ చెప్పలేకపోతున్నారు. డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ సిద్ధమైతే తప్ప సునీతా విలియమ్స్, విల్మోర్ వెనక్కి రాలేరు. ఏప్రిల్ నాటికి కూడా డ్రాగన్ అందుబాటులోకి రావడం అనుమానమేనని నాసా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.ఇదిలా ఉండగా, సునీతా విలియమ్స్, విల్మోర్ రాక ఆలస్యమవుతుండడం మరో కీలక ప్రయోగంపై ప్రభావం చూపుతోంది. యాక్సియోమ్-4 మిషన్‌లో భాగంగా డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లోనే భారత గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా సహా మరో ముగ్గురు ప్రైవేట్ వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు చేరుకోవాల్సి ఉంది. ఏప్రిల్‌లో ఈ ప్రయోగం చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించారు. డ్రాగన్‌లో సునీతా విలియమ్స్, విల్మోర్‌ను వెనక్కి వస్తేనే ఈ నలుగురు ఐఎస్ఎస్‌కు చేరుకోగలుగుతారు. లేకపోతే ప్రయోగం వాయిదా వేయక తప్పదు. ఒకవేళ అంతా అనుకున్నట్లు జరిగితే మార్చి 19లోగా ఇద్దరు వ్యోమగాములు వెనక్కి వచ్చేస్తారు. అప్పుడు యాక్సియోమ్-4 మిషన్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సునీతా విలియమ్స్, విల్మోర్ గత ఏడాది జూన్‌లో బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో ఐఎస్ఎస్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం వారం రోజుల్లో భూమిపైకి తిరిగిరావాలి. స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలతో అది సాధ్యం కాలేదు. వారిద్దరూ అక్కడే ఉండిపోయారు. వారి ఆరోగ్యం బాగుందని, ఎలాంటి సమస్యలు లేవని నాసా అధికారులు ప్రకటించారు.



# తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల కేసు..
## >>>> నేడు సుప్రీం కోర్టులో విచారణ <<<<

- సుప్రీం ఆదేశాలతో ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ
- హైకోర్టు ఆదేశాలు అమలు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపణ
- స్పీకర్ ఆలస్యం చేస్తోందని కేటీఆర్ సుప్రీంకోర్టులో రిట్ దాఖలు
- స్పీకర్‌పై సుప్రీంకోర్టు అసహనం, త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచన
- ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ డిమాండ్



**ఈ-కబురు,ఢిల్లీ**

ఫిబ్రవరి 09 : పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ సోమవారం సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

ఇంతకు ముందు ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

### కేటీఆర్ రిట్ దాఖలు

ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కాలయాపన చేస్తున్నారంటూ కేటీఆర్ సుప్రీంకోర్టులో జనవరి 29వ తేదీన రిట్ దాఖలు చేశారు. స్పీకర్ వెంటనే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోర్టును కోరారు. అయితే ఫిరాయింపులపై బీఆర్ఎ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ విచారణ నడుస్తోంది.ఈ క్రమంలో ఈ రెండు పిటిషన్లను కలిపి 10వ తేదీన విచారణ చేస్తామని ద్విసభ్య ధర్మాసనం తెలిపింది.బీఆర్ఎస్ పార్టీ మీద గెలిచిన ఎమ్మెల్యేలు శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాష్ గౌడ్, అరికె పూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి,సంజయ్ కుమార్‌లు పార్టీ ఫిరాయించిన సంగతి తెలిసిందే. వీళ్లపై అనర్హత వేటు వేయాలని కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు.

### మరో పిటిషన్‌లో..

ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సహా పలువురు స్పెషల్ లీవ్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ గవాయ్, అగస్టిన్ జార్జ్ మసీహ్లతో కూడిన ధర్మాసనం ఆ పిటిషన్‌ను శుక్రవారం(జనవరి 31న) విచారణ జరిపింది. ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని కిందటి ఏడాది మార్చి తెలంగాణ హైకోర్టు ఆదేశించిందని, అయితే కోర్టు ఆదేశాలను తెలంగాణ స్పీకర్ ధిక్కరించారని, కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదని పాడి కౌశిక్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే.. సంబంధిత ఎమ్మెల్యేలకు ఇప్పటికే స్పీకర్ నోటీసులు జారీ చేశారని అసెంబ్లీ సెక్రటరీ, తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. ఫిరాయింపుల వ్యవహారాల్లో స్పీకర్ తొందరపాటు నిర్ణయాలు సరికాదని గతంలో సుప్రీం కోర్టు చెప్పడాన్ని ఆయన బెంచ్ ముందు ప్రస్తావించారు. కాబట్టి, స్పీకర్ నిర్ణయానికి తగు సమయం కావాలని ఆయన కోరారు.అయితే.. ఇంకెంత కాలం ఎదురుచూస్తారని, మహారాష్ట్రలో లాగా ఎమ్మెల్యేల పదవికాలం అయ్యేదాకా ఎదురు చూస్తారా? అని సుప్రీం కోర్టు తెలంగాణ స్పీకర్‌పై అసహనం వ్యక్తం చేసింది. దీంతో స్పీకర్ అడిగి చెప్తానని లాయర్ రోహత్గి చెప్పడంతో విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. రేపు (ఫిబ్రవరి 10న) కౌశిక్ రెడ్డి ఎస్ఎల్‌పీ, కేటీఆర్ రిట్ పిటిషన్‌లను కలిపి సుప్రీం కోర్టు విచారణ జరపనుంది.

# కుంభమేళా కిటకిట..
## 200-300కి.మీ మేర ట్రాఫిక్ జామ్‌లు..!





**ఈ-కబురు,ప్రయాగ్‌రాజ్**

ఫిబ్రవరి 09 : మహా కుంభమేళాలో పాల్గొనేందుకు కోట్లాది మంది భక్తులు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తరలివెళ్తున్నారు. ఈ ఆధ్యాత్మిక సంబరం ప్రారంభమై 28రోజులు గడుస్తున్నా.. రద్దీ మాత్రం తగ్గడం లేదు. ప్రయాగ్‌రాజ్ వైపు వెళ్లే మార్గాలన్నీ వాహనాలతో కిక్కిరిపోతున్నాయి. మొత్తంగా దాదాపు 200-300 కి.మీ మేర ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌లే కనిపిస్తున్నాయి. గంటలపాటు యాత్రికులు వాహనాల్లోనే ఉండిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రద్దీని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు మధ్యప్రదేశ్‌లోనే వేలాది వాహనాలను నిలిపివేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ అధికారుల నుంచి అనుమతి వస్తేనే వాటిని ముందుకు అనుమతిస్తున్నట్లు సమాచారం.

### గంటల పాటు ట్రాఫిక్‌లోనే..

కుంభమేళాకు వెళ్లే వాహనాలతో ప్రయాగ్‌రాజ్ దారులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ప్రయాగ్‌రాజ్-కాన్పుర్, ప్రయాగ్‌రాజ్-లఖ్‌నవూ-ప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్-వారణాసి-మిర్జాపుర్, ప్రయాగ్‌రాజ్-రేవా వెళ్లే జాతీయ రహదారుల్లో మూడు రోజులుగా విపరీతమైన రద్దీ కొనసాగుతోంది.48 గంటలుగా ట్రాఫిక్‌లోనే చిక్కుకున్నట్లు అనేక మంది ప్రయాణికులు పేర్కొంటున్నారు. 50 కి.మీ మేర దూరానికే 10 నుంచి 12గంటల సమయం పడుతుందని వాపోతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు.ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న వాహనాల రద్దీ దృష్ట్యా.. ఆదివారం నాడు మధ్యప్రదేశ్ పరిధిలోని అనేక జిల్లాల్లో ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడే నిలిపివేశారు. రాష్ట్రంలోని కటనీ, మైహర్, రివా జిల్లాల్లో పరిస్థితి దారుణంగా ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం వరకు ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడే నిలిపివేస్తున్నామని, సురక్షిత ప్రాంతాలు చూసుకోవాలని కటనీ జిల్లా పోలీసులు ప్రకటించారు.రేవా-ప్రయాగ్‌రాజ్ రహదారిలో వాహనాలు ముందుకు వెళ్లే ప్రసక్తి లేదని జిల్లా పోలీసులు పేర్కొన్నారు. చాక్‌ఘాట్ తర్వాత విపరీతంగా రద్దీ ఉందని, దాంతో వాహనాలు నిలిపివేశామని రివా జిల్లా కలెక్టర్ ప్రతిభా పాల్ వెల్లడించారు. ట్రాఫిక్‌లో చిక్కుకున్న వారికోసం తాత్కాలిక వసతి, నీరు, ఆహారం అందించే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

### ఒక్కరోజే కోటిన్నర భక్తులు..

కర్ణాటక, ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, రాజస్థాన్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు కుంభమేళాకు తరలి వెళ్తున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల వరకే సుమారు కోటి 41లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు అంచనా. దీంతో ఇప్పటివరకు మొత్తంగా 42కోట్ల మందికి పైగా ప్రయాగ్‌రాజ్‌ను దర్శించినట్లు యూపీ ప్రభుత్వం వెల్లడించింది.



## కోళ్లకు అంతు చిక్కని
# వైరస్..
### రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్!


**ఈ-కబురు,హైదరాబాద్**

ఫిబ్రవరి 09 : ముక్క ముట్టందే ముద్ద దిగడం లేదా? అయితే తస్మాత్ జాగ్రత్త. అంతుచిక్కని వైరస్‌తో కోళ్లు గుడ్లు తేలేస్తున్నాయి. ఇటీవల మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల్లో కోళ్లకు అంతు చిక్కని వైరస్ ప్రభలింది. ఫలితంగా వేలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ తరుణంలో కేంద్రం అప్రమత్తమైంది. కోళ్లకు సోకుతున్న అంతుచిక్కిన వైరస్ పట్ల అప్రత్తంగా ఉండాలని రాష్ట్రాల్ని అలెర్ట్ చేసింది.ఈ తరుణంలో కేంద్రం ఆదేశాలతో తెలంగాణ పశు సంవర్ధక శాఖ అప్రమత్తమైంది. పశు సంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి గోష్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. పౌల్ట్రీ రైతులు బయో సెక్యూరిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వైరస్ సోకిన కోళ్ళ తరలింపులో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. మరోవైపు, కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంప్ గ్రామంలో ఆదివారం అంతుచిక్కని వ్యాధితో వేలాది కోళ్లు మృతి చెందాయి. ఇప్పటికే తిర్మలాపూర్, బీర్కూర్ మండలంలోని చించోలి, కిస్టాపూర్ ఫారాల్లో 6వేలకు పైగా బాయిలర్ కోళ్లు మృతి చెందడంపై నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గల్లంతైన విమానం ఆచూకీ దొరికింది
### పైలట్ సహా అందులోని పది మందీ మృతి

**ఈ-కబురు,ంఅలాస్కా**

ఫిబ్రవరి 09 : అమెరికాలోని అలాస్కాలో గల్లంతైన విమానం ఆచూకీ లభ్యమైంది. పైలట్ సహా అందులోని మొత్తం పది మందీ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం ఉనలక్లీట్ నుంచి టేకాఫ్ తీసుకున్న సింగిల్ ఇంజిన్ సెస్నా గ్రాండ్ కారవాన్ విమానం విమానం నోమ్ సమీపంలో గల్లంతైంది. అందులో పైలట్ సహా 10 మంది ప్రయాణికులున్నారు. మరో అరగంటలో ల్యాండవనుండగా రాడార్‌తో సంబంధం కోల్పోయింది. చిట్టచివరి లోకేషన్ ఆధారంగా హెలికాప్టర్‌తో అధికారులు గాలింపు చేపట్టి, గడ్డకట్టిన సముద్ర జలాల్లో శకలాలను కనుగొన్నారు. విమానంలో సాంకేతిక లోపం, ఇతర సమస్యలపై ప్రమాదానికి ముందు ఎలాంటి హెచ్చరికలు తమకు అందలేదని అధికారులు వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# జీసీసీలతో 4.5 లక్షల కొత్త కొలువులు

**హైరింగ్ ప్రణాళికల్లో 35% సంస్థలు**

**2030 నాటికి పరిశ్రమలో 33 లక్షల మంది నిపుణులు**

**ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ నివేదిక**

**దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో కొత్త కొలువులు రానున్నాయి. ఈ ఏడాది (2025లో) 4.25%-%4.5 లక్షలు, వచ్చే ఆరేళ్లలో పది లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. 35 శాతం కంపెనీలు తమ సిబ్బంది సంఖ్యను 50%-%100 శాతం పెంచుకునే యోచనలో ఉన్నాయి**




గ్లోబల్ టెక్నాలజీ, డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ రూపొందించిన ఇండియా జీసీసీ గ్రోత్ ఔట్‌లుక్ 2024 నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 6 ప్రధాన నగరాల్లో 10 రంగాలవ్యాప్తంగా 207 జీసీసీల నుంచి సేకరించిన వివరాలతో ఈ నివేదిక రూపొందింది. దీని ప్రకారం, నిపుణుల లభ్యత, పరిశ్రమకు అనువైన పాలసీల దన్నుతో జీసీసీలకు భారత్ ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారింది. 2030 నాటికి పరిశ్రమలో మొత్తం 33 లక్షల మంది ప్రొఫెషనల్స్ ఉంటారు.

## 2,100కు జీసీసీలు ..

'గ్లోబల్ జీసీసీ హబ్‌గా భారత్ స్థానం మరింతగా పటిష్టమవుతోంది. 2030 నాటికి వీటి సంఖ్య 2,100కి చేరనుంది. మార్కెట్ పరిమాణం 100 బిలియన్ డాలర్లకు చేరవచ్చు. జీసీసీ 4.0కి సన్నాహాలు జరుగుతున్న తరుణంలో దేశీయంగా టెక్, ఫైనాన్స్, తయారీ, సస్టైనబిలిటీ వంటి విభాగాల్లో నియామకాలు మరింతగా పెరగనున్నాయి. ఆర్థిక సేవలకు సంబంధించి నైపుణ్యాలకు గణనీయంగా డిమాండ్ (79 శాతం) ఉంటుంది. వ్యాపార సంస్థలు డిజిటల్ బాట పడుతుండటంతో మార్కెటింగ్.. డిజిటల్ అడ్వర్టైజింగ్ (73 శాతం) తర్వాత స్థానంలో నిలుస్తుంది. అలాగే ఇంజినీరింగ్, తయారీ (69 శాతం), మానవ వనరుల నైపుణ్యాలకు (68 శాతం) డిమాండ్ ఉంటుంది' అని ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ సీఈవో సచిన్ అలగ్ తెలిపారు.

**నివేదికలోని మరిన్ని విశేషాలు..**

ఫ్రెషర్స్ నియామకాల విషయంలో బెంగళూరు, ముంబై, పుణె, చెన్నై నగరాల్లోని జీసీసీలు ముందు వరుసలో ఉంటాయి. 2030 నాటికి 42% జీసీసీ లు తమ సిబ్బందిని 50% మేర పెంచుకోనున్నాయి.

61 శాతం జీసీసీలు మహిళా ఉద్యోగుల నియామకాలు 50 శాతం పైగా పెరుగుతాయని అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం ఇది సుమారు 7 శాతంగా ఉంది.

2026 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలతో ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రాంతాల్లో జీసీసీల వృద్ధి, కీలక విభాగాల్లో నిపుణులకు డిమాండ్ కొనసాగనుంది.

# జీడీపీలో బీర్ పరిశ్రమ వాటా 0.3 శాతం

దేశ జీడీపీలో బీర్ పరిశ్రమ వాటా 2023లో 0.3 శాతానికి చేరుకుంది. రూ.92,324 కోట్లు సమకూరినట్లు బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ నిర్వహించిన అధ్యయనాన్ని ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా బీర్ పరిశ్రమ పరిమాణం 2023లో రూ.76.45 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఆక్స్‌ఫర్డ్ నివేదిక పేర్కొంది.

న్యూఢిల్లీ: దేశ జీడీపీకి బీర్ పరిశ్రమ నుంచి నేరుగా రూ.40,050 కోట్లు వస్తుండగా, అనుబంధ వ్యాల్యూ చైన్ (లాజిస్టిక్స్, రెస్టారెంట్‌లు, రిటైలర్లు) ద్వారా మరో రూ.52,239 కోట్లు సమకూరుతోంది. ఎక్సైజ్, సేల్స్ ట్యాక్స్, ఇతర పన్నుల రూపంలో రూ.51,376 కోట్ల ఆదాయం 2023లో ప్రభుత్వ ఖజానాలకు చేరినట్టు పేర్కొంది. మొత్తం పన్నుల ఆదాయంలో 1.8 శాతానికి సమానమని తెలిపింది. బీర్ పరిశ్రమ, వ్యాల్యూ చైన్ సంయుక్తంగా 13 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు.. ఇందులో బీర్ పరిశ్రమ ఒక్కటే 5.4 లక్షల మందికి ఉపాధినిస్తున్నట్టు వివరించింది.

"బీర్ అన్నది పూర్తిగా స్థానిక తయారీ ఉత్పత్తి. అధిక పరిమాణంతో కూడినది. స్థానిక ఆర్థిక వ్యవస్థపై ఇది ఎన్నో అంచల ప్రభావం చూపిస్తుంటుంది. స్థానిక రైతుల నుంచి బార్లీ కొనుగోలు చేస్తుంది. స్థానిక సరఫరాదారుల నుంచి ప్యాకేజింగ్ మెటీరియల్ సమకూర్చుకుంటుంది. హ్యాండ్లింగ్‌లో ఎక్కువ మంది పాలు పంచుకుంటారు. పెద్ద స్థాయి గోదాములు, ఉత్పత్తుల రవాణాకు పెద్ద ఎత్తున రవాణా సదుపాయాలను వినియోగించుకుంటుంది" అని బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి వివరించారు.



# రూ. 20,000 కోట్ల నిధులు వాడుకోండి..

పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)పై దేశీ కార్పొరేట్లు మరింత దృష్టి సారించాలని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ తాజాగా పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయించిన రూ. 20,000 కోట్లు నాణ్యమైన ప్రతిపాదనకు వినియోగించుకోవాలని సూచించారు.

ప్రయివేట్ రంగ ఆధారిత ఆర్‌అండ్‌డీకి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ. 20,000 కోట్లు కేటాయించిన విషయాన్ని బడ్జెట్ తదుపరి సీఐఐ సభ్యులతో ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టి సందర్భంగా ప్రస్తావించారు. ఏడాది చివరికల్లా మొత్తం నిధులను వినియోగించుకునేలా అత్యుత్తమ ప్రతిపాదనలతో తరలిరావలసిందిగా ఆహ్వానించారు.

పర్యావరణహిత ఇంధనాలవైపు ప్రయాణంలో ప్రయివేట్ రంగం చేయూత నివ్వాలని కోరారు. ఇదేవిధంగా అణు విద్యుత్ విషయంలో ప్రభుత్వం పరిశ్రమతో కలసి పనిచేయనున్నట్లు తెలియజేశారు.

2025-26 బడ్జెట్‌ను ప్రకటిస్తూ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రైవేట్ రంగ ఆధారిత ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఒక కార్పస్‌గా సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు రూ.20,000 కోట్లు కేటాయించారు. గత జూలై బడ్జెట్‌లోనూ ఆమె రూ. లక్ష కోట్ల పరిశోధనాభివృద్ధి నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.




# స్కోడా ఈవీ వస్తోంది.. అదిరిపోయే రేంజ్!

వాహన తయారీ సంస్థ స్కోడా ఇండియా నుంచి తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈ ఏడాదే వస్తోంది. సెప్టెంబర్ కల్లా భారతీయ రోడ్లపై స్కోడా ఎన్యాక్ పరుగు తీయనుంది. తొలుత పూర్తిగా తయారైన కారును భారత్‌కు దిగుమతి చేస్తారు. 63, 82 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్స్‌తో రూపుదిద్దుకుంది.




## పర్ఫార్మెన్స్, రేంజ్

ఎన్యాక్ అధునాతన ఎలక్ట్రిక్ మోటార్లతో థ్రిల్లింగ్ పర్ఫార్మెన్స్ ఇస్తుంది. ఎలక్ట్రిక్ వాహనాలు తక్షణ టార్క్‌ను అందిస్తాయి. ఎన్యాక్ ఆకట్టుకునే రేంజ్ కలిగి ఉంది. ఒకసారి చార్జింగ్‌తో బ్యాటరీని బట్టి 439%-%597 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. టాప్ స్పీడ్ గంటకు 180 కిలోమీటర్లు. గంటకు 100 కి.మీ. వేగాన్ని 6.7 సెకన్లలో అందుకుంటుంది. 30 ని. చార్జింగ్ 10 నుంచి 80 శాతానికి చేరుతుంది.

## డిజైన్, స్టైల్

**ఎన్యాక్ దృఢమైన లైన్లు, ఉల్లాసమైన ఆకారాలను కలిగి ఉంటుంది. సిగ్నేచర్ స్కోడా గ్రిల్, ఎలక్ట్రిక్ ఓరియెంటెడ్ రీమేక్ అయినప్పటికీ, ఇప్పటికీ దాని ఐకానిక్ ఫీచర్‌ను కలిగి ఉంది. సొగసైన ఎల్ఈడీ హెడ్‌లైట్లు, వంపులు ఆధునిక లుక్ అందిస్తాయి.**

# ఈ స్కూటర్‌ను 18 లక్షల మంది కొనేశారు

టీవీఎస్ ఎన్‌టార్క్ 125 అమ్మకాల్లో అరుదైన మైలురాయిని చేరుకుంది. 2024 డిసెంబర్ చివరి నాటికి కంపెనీ 18,88,715 యూనిట్లను విక్రయించింది. దీంతో హోండా యాక్టివా, టీవీఎస్ జుపిటర్, సుజుకి యాక్సెస్ తరువాత.. ఎన్‌టార్క్ 125 అత్యధికంగా అమ్ముడైన నాల్గవ స్కూటర్‌గా రికార్డ్ క్రియేట్ చేసింది.

టీవీఎస్ మోటార్ 2018 ప్రారంభంలో ఎన్‌టార్క్‌ను ప్రవేశపెట్టింది. ఆ సమయంలో భారతదేశంలో 125సీసీ స్కూటర్లకు మంచి డిమాండ్ ఉండేది. అప్పటి నుంచి కంపెనీ దీనిని అప్డేట్ చేస్తూ.. కొత్త వేరియంట్‌లను ప్రవేశపెడుతూనే ఉంది. కంపెనీ అమ్మకాలు పెరగడానికి కూడా ఈ స్కూటర్ దోహదపడింది.

ఎన్‌టార్క్ స్కూటర్ బేస్ (డ్రమ్/డిస్క్), రేస్ ఎడిషన్, సూపర్ స్క్వాడ్ ఎడిషన్, రేస్ %శూ%, రేస్ %ఋ% అనే ఆరు వేరియంట్లలో లభిస్తుంది. దీని ధరలు రూ. 84,600 నుంచి రూ. 1,04,600 (ఎక్స్ షోరూమ్) మధ్య ఉంది. రేస్ %శూ% ఎడిషన్ 10.2 హార్స్ పవర్, 10.8 ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తే.. మిగిలిన వేరియంట్స్ 9.4 హార్స్ పవర్, 10.5 ఎన్ఎమ్ టార్క్ అందిస్తాయి.



# ‘మంగళవారం’లో..?

**తెలుగు చిత్ర పరిశ్రమలో మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్‌గా దూసుకెళుతున్నారు శ్రీలీల. ఇప్పటికే అరడజను సినిమాలతో బిజీ బిజీగా ఉన్న ఈ బ్యూటీ తొలిసారి ఓ లేడీ ఓరియంటెడ్ మూవీలో నటించనున్నారని టాక్. అది కూడా హిట్ మూవీ ‘మంగళవారం’ సీక్వెల్‌లో అట. అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘మంగళవారం’. 2023 నవంబరు 17న విడుదలైన ఈ చిత్రం హిట్‌గా నిలిచింది.**

ప్రత్యేకించి పాయల్ రాజ్‌పుత్ నటనకి మంచి మార్కులే పడ్డాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా ‘మంగళవారం 2’ రూపొందనుంది. అయితే ద్వితీయ భాగంలో తాను లీడ్ రోల్‌లో నటించడం లేదంటూ పాయల్ రాజ్‌పుత్ ఇన్‌డైరెక్ట్‌గా చెప్పారట. సీక్వెల్‌లో పూర్తిగా కొత్త కథ ఉంటుందని, అందుకే పాయల్ రాజ్‌పుత్ కాకుండా మరో హీరోయిన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించే ఆలోచనలో అజయ్ భూపతి ఉన్నారని సమాచారం.

సీక్వెల్ కథకి శ్రీలీల అయితే సరిగ్గా సరిపోతుందన్నది ఆయన ఆలోచన అని ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ‘మంగళవారం 2’ గురించి శ్రీలీలతో ఆయన చర్చిం చారా? లేదా? ఈ మూవీకి ఆమె పచ్చజెండా ఊపుతారా? లేదా వంటి విషయాలపై అధికారిక ప్రకటన వచ్చేవరకు వేచి చూడక తప్పదు. శ్రీలీల ప్రస్తుతం తెలుగులో నితిన్ ‘రాబిన్ హుడ్’, రవితేజ ‘మాస్ జాతర’, పవన్ కల్యాణ్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’, తమిళంలో శివ కార్తికేయన్‌తో ‘పరాశక్తి’ మూవీ చేస్తున్నారు.








# ఓటీటీలో గ్లామర్ బ్యూటీ సినిమా..

## సర్‌ప్రైజ్ స్ట్రీమింగ్

అప్సర రాణి ప్రధాన పాత్రలో తెరకెక్కిన సస్పెన్స్ థ్రిల్లర్ “తలకోన” ఓటీటీలోకి వచ్చేసింది. గతేడాది మార్చి 29న ఈ మూవీ థియేటర్లలో రిలీజైంది. నటి అప్సర రాణికి సోషల్‌మీడియాలో భారీగా ఫాలోవర్స్ ఉన్నారు. దీంతో ఆమె నటించిన మూవీ సడెన్‌గా ఓటీటీలోకి ఎంట్రీ ఇవడంతో నెట్టింట వైరల్ అవుతుంది. ఇప్పటివరకు అప్సర రాణీ చేయని వెరైటీ సబ్జెక్ట్ కావడంతో సినిమాపై భారీగా బజ్ క్రియేట్ అయింది. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ కథ మొత్తం ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో ఉంటుంది.

తలకోన సినిమా ఎలాంటి ప్రకటన లేకుండానే సడెన్‌గా అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే, ఈ సినిమా చూడాలంటే రూ. 99 చెల్లించాల్సి ఉంటుంది. ఈ మూవీ కోసం ఆమె మరింత గ్లామర్‌గా కనిపించడమే కాకుండా భారీ యాక్షన్ సీన్స్‌లలో కూడా దుమ్మురేపింది. ఈ సినిమాకు ఐఎమ్‌డీబీలో 8.7 రేటింగ్ ఉండటం విశేషం. హీరోయిన్, ఆమె స్నేహితులు కలిసి తలకోన ఫారెస్ట్‌కి వెళ్లినప్పుడు ఏం జరిగింది..? అనేది కథాంశం. ప్రకృతికి విరుద్ధంగా వెళితే ఎలాంటి పరిణామాలు జరుగుతాయో ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశారు.

ఈ చిత్రానికి నగేష్ నారదాసి దర్శకత్వం వహించారు. అక్షర క్రియేషన్స్ పతాకంపైదేవర శ్రీధర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రంలో అశోక్ కుమార్, అజయ్ ఘోష్, విజయ కరణ్, రంగ రాజన్, రాజా రాయ్ యోగి కత్రి ప్రముఖ పాత్రలు పోషించారు. ఈ సినిమాకు సుభాష్ ఆనంద్ సంగీతం అందించారు.

# మిస్ ఇళయా సినిమా ప్రారంభం

టాలీవుడ్‌లో ‘మిస్ ఇళయా’ అనే ప్రత్యేకమైన టైటిల్‌తో ఒక సినిమా తెరకెక్కనుంది. ఈ మూవీకి మట్టా శ్రీనివాస్, చాహితీ ప్రియా నిర్మాతలుగా ఉన్నారు. వేముల జి దర్శకత్వంలో రానున్న ఈ మూవీలో హీరో కుషాల్ జాన్ ప్రధాన పాత్రలో నటించనున్నారు. తాజాగా పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. కాస్మిక్ పవర్ ప్రొడక్షన్ బ్యానర్‌లో వస్తున్న ఈ సినిమా త్వరలో షూటింగ్ మొదలు అవుతుంది. ఈ కార్యక్రమంలో చిత్రబృందం, కొంతమంది సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

> **హీరో కుషాల్ జాన్ మాట్లాడుతూ.. ‘ఈ సినిమా కథ వినగానే చాలా ఆసక్తిగా అనిపించింది. నేను ఇలాంటి పాత్రలో చేయడం ఇదే మొదటిసారి. ఇది నా కెరీర్‌లో ఓ ప్రత్యేకమైన స్థానం కల్పించే చిత్రం అవుతుందని నమ్ముతున్నాను. ప్రేక్షకుల ఆదరణ కోసం ఎదురుచూస్తున్నాను’ అని తెలిపారు.**

డైరెక్టర్ వేముల జి మాట్లాడుతూ.. ‘ఈ చిత్రం వినూత్నమైన కథతో తెరకెక్కుతుంది. ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు ఇందులో ఉంటాయి. హీరో కుషాల్ జాన్ ఈ పాత్రకు న్యాయం చేస్తారని నమ్మకంగా చెప్పగలను. మేము ఈ సినిమాను అత్యున్నత ప్రమాణాలతో రూపొందించబోతున్నాము’ అని అన్నారు.

ప్రొడ్యూసర్ మట్టా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ‘సహ నిర్మాత చాహితీ ప్రియతో మా బ్యానర్ ‘కాస్మిక్ పవర్ ప్రొడక్షన్’పై వస్తున్న ఈ చిత్రం కోసం ఎంతో అన్వేషణ చేసి, మంచి కథను ఎంపిక చేసుకున్నాం. సినిమాకు అనుగుణంగా ఉన్న సాంకేతిక బృందం, ప్రతిభావంతమైన నటీనటులతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే సినిమా అవుతుందని నమ్మకం ఉంది’ అని తెలిపారు. ‘మిస్ ఇళయా’ సినిమా తొలి షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం పేర్కొంది.






# హద్దులు మీరినా నో ఛాన్స్..

## కారణాలు చెప్పిన మృణాల్ ఠాకూర్

**ముద్దు** వచ్చినప్పుడే చంక ఎక్కాలన్నది సామెత. ఇందుకు విరుద్ధంగా జరిగితే అంతా తారుమారే. నటి మృణాల్ ఠాకూర్‌ది ఇంచుమించు ఇదే పరిస్థితి. బుల్లితెర నుంచి వెండితెరకు పరిచయమైన ఉత్తరాది భామ ఈమె. మొదట్లో మరాఠీ చిత్రాల్లో నటించిన తర్వాత బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. అక్కడ చిత్రాలు నటిస్తుండగానే తెలుగులో సీతారామం మూవీలో నటించే అవకాశం వరించింది. అందులో నటుడు దుల్కర్ సల్మాన్‌కు జంటగా నటించారు. అది చాలా ట్రెడిషనల్ పాత్ర. ఆ పాత్రలో ఈ భామ ఒదిగి పోవడం, చిత్రం ఘనవిజయాన్ని సాధించడంతో నటి మృణాల్ ఠాకూర్ క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో తెలుగులో అవకాశాలు వరుస కట్టాయి.

ఈ క్రమంలో నటుడు నానితో జత కట్టిన ‘హాయ్ నాన్న’ చిత్రం కూడా మంచి విజయాన్ని అందుకుంది. అలాంటి సమయంలో కోలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. శివ కార్తికేయన్ కు జంటగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో నటించే పెద్ద అవకాశం తలుపు తట్టింది. అయితే కారణాలేమైన ఆ అవకాశాన్ని ఈ అమ్మడు చేజార్చుకుంది. ఆ తర్వాత ఇప్పటివరకు మృణాల్ ఠాకూర్ కోలీవుడ్‌లో అవకాశం రాలేదు. అంతేకాకుండా ఆ తర్వాత తెలుగులో విజయ్ దేవరకొండ సరసన నటించిన ఫ్యామిలీ మెన్ చిత్రం కూడా ఆశించిన విజయాన్ని సాధించలేదు.

గ్లామర్ విషయంలో ఎంతగా హద్దులు మీరినా, దక్షిణాదిలో నటి మృణాల్ ఠాకూర్ దాదాపు కనుమరుగైన పరిస్థితి. మళ్లీ దక్షిణాదిలో కనిపించకపోవడానికి కారణం ఏమిటన్న ప్రశ్నకు ఆమె ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ అభిమానులు తన కథాపాత్రలను ఆదరిస్తున్నారని అందువల్ల వారికి నచ్చే విధంగా కథాపాత్రలను ఎంపిక చేసుకునే విషయంలో ఆచి చూసి అడిగేస్తున్నానని చెప్పారు. ఒక చిత్రంపై పూర్తిగా దృష్టి పెట్టకుండా పలు చిత్రాలను అంగీకరించే మనస్తత్వం తనదు కాదని పేర్కొన్నారు. అందుకే మంచి కథ పాత్రల కోసం ఎదురుచూస్తున్నట్లు నటి మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చారు.

# హీరో లేడీ గెటప్ వేస్తే హిట్టే

## నిర్మాత సాహు గారపాటి

> **“హీరో లేడీ గెటప్ వేసిన ‘భామనే సత్యభామనే, మేడమ్’ వంటి సినిమాలు ప్రేక్షకులను అలరించి, హిట్స్‌గా నిలిచాయి. ఈ సెంటిమెంట్‌తో ‘లైలా’ మూవీ కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. అలాగే తెలుగులో ఈ తరహా సినిమాలు వచ్చి కూడా చాలా కాలం అయింది. దీంతో ‘లైలా’ మూవీ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది” అని అన్నారు నిర్మాత సాహు గారపాటి. విశ్వక్ సేన్ హీరోగా నటించిన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ ‘లైలా’. ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో కామాక్షీ భాస్కర్ల, అభిమన్యు సింగ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.**

రామ్ నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ%-% “యూత్ టార్గెట్‌గా చేసిన ‘లైలా’ని ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమాలో హీరో లేడీ క్యారెక్టర్ (లైలా) కూడా చేశారు. ఈ క్యారెక్టర్ కోసం ముందుగా కొందరు హీరోలను అనుకున్నాం. విశ్వక్ ఈ కథ వినగానే ‘ఇది నేను చేయాల్సిన క్యారెక్టర్’ అన్నారు.

హీరో తొలి భాగం సోనూగా, రెండో భాగం లైలాగా మారతాడు. లైలాగా హీరో ఎందుకు మారాడు? అనేది ఎమోషనల్‌గా ఉంటుంది. ఇక ప్రస్తుతం నిర్మాత పరిస్థితి ఏమీ బాగోలేదు. అనుకున్న బడ్జెట్‌లో సినిమాను నిర్మించగలిగితే ఓకే. ‘లైలా’ని అనుకున్న బడ్జెట్‌లోనే తీశాం. చిరంజీవిగారితో అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో మేం చేయనున్న నెక్ట్స్ మూవీ జూన్ లేదా



జూలైలో ప్రారంభం అవుతుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో చేస్తున్న సినిమా చిత్రీకరణ 70 శాతం పూర్తయింది” అని అన్నారు.

## ఫైనల్లో సన్‌రైజర్స్ చిత్తు..

# ఛాంపియన్స్‌గా ముంబై టీమ్




**సౌతాఫ్రికా టీ20 లీగ్-2025 విజేతగా ఎంఐ కేప్‌టౌన్ నిలిచింది. జోహన్నెస్‌బర్గ్ వేదికగా జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌ను 76 పరుగుల తేడాతో చిత్తు చేసిన ఎంఐ కేప్‌టౌన్.. తొలిసారి టైటిల్‌ను ముద్దాడింది. ఫైనల్ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన ఎంఐ కేప్ టౌన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది.**

ఎంఐ కేప్‌టౌన్‌కు ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్( 15 బంతుల్లో 1 ఫోర్లు, 4 సిక్స్‌లతో 33), రాస్సీ వాన్‌డర్‌డుస్సెన్(23) అద్భుతమైన ఆరంభించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత ఎస్టర్‌హుజెన్(26 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు 39), డెవాల్డ్ బ్రెవిస్(18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 38) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. సన్‌రైజర్స్ బౌలర్లలో మార్కో జాన్సెన్, గ్లీసన్, డాసన్ తలా రెండు వికెట్లు పడగొట్టగా.. ఓవర్టన్, మార్‌క్రమ్ చెరో వికెట్ సాధించారు.

### నిప్పులు చెరిగిన రబాడ..

అనంతరం 182 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ 18.4 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. ఎంఐ బౌలర్ల దాటికి ఈస్టర్న్ కేప్ బ్యాటర్లు విల్లవిల్లాడారు. సన్‌రైజర్స్ బ్యాటర్లలో టామ్ అబెల్(30),టోనీ డిజోర్జ్(26) మినహా మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు.

ఎంఐ బౌలర్లలో కగిసో రబాడ నాలుగు వికెట్లతో నిప్పులు చెరగగా.. బౌల్ట్, లిండే తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు రషీద్ ఖాన్, కార్బిన్ బోష్ తలా వికెట్ సాధించారు. దీంతో వరుసగా మూడోసారి ఛాంపియన్స్‌గా నిలవాలనుకున్న సన్‌రైజర్స్ ఆశలపై ఎంఐ కేప్‌టౌన్ నీళ్లు చల్లింది.

### ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా జాన్సెన్..

ఇక ఈ టోర్నీ అసాంతం అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన సన్‌రైజర్స్ ఈస్టన్ కేప్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్‌కు ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు దక్కింది. 13 మ్యాచ్‌ల్లో 18.42 సగటుతో జాన్సెన్ 19 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లోనూ జాన్సెన్ 204 పరుగులు చేశాడు.




# హిట్‌మ్యాన్ సూపర్ షో.. సిరీస్ టీమిండియా కైవసం

ఇంగ్లండ్‌తో కటక్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చెలరేగి ఆడి జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. ఇంగ్లండ్ నిర్దేశించిన 305 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 44.3 ఓవర్లలోనే ఆరు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. రోహిత్ శర్మ వీరవిహారంతో టీమిండియా అవలీలగా విజయం సాధించింది. ఫలితంగా సిరీస్‌ను 2-0 తేడాతో ఇంకోమ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది టీమిండియా.

### హిట్‌మ్యాన్ సూపర్ షో..

చాలాకాలం తర్వాత బ్యాటింగ్‌లో చెలరేగిన రోహిత్.. సెంచరీతో మెరిశాడు. గత కొంతకాలంగా ఫామ్ కోసం తంటాలు పడుతున్న హిట్ మ్యాన్.. తిరిగి సత్తా చాటాడు. తనపై వరుసగా వస్తున్న విమర్శలకు బ్యాట్‌తోనే సమాదానం చెప్పాడు రోహిత్. 76 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్స్‌లతో తనదైన శైలిలో రెచ్చిపోయి శతకం పూర్తి చేసుకున్నాడు. సిక్స్ కొట్టి సెంచరీ పూర్తి చేయడం విశిషం. ఇది రోహిత్‌కు 18 నెలల తర్వాత వన్డేల్లో తొలి సెంచరీ. 90 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్స్‌లతో 119 పరుగులు చేశాడు రోహిత్. ఇది రోహిత్‌కు 32వ వన్డే శతకం.

### కోహ్లి విఫలం..

శుభ్‌మన్ గిల్(60బీ 52 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) తో కలిసి భార్భీభాగస్వామ్యాన్ని నెలకొల్పాడు రోహిత్. ఈ జోడి తొలి వికెట్‌కు 135 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన తర్వాత గిల్ తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తరుణంలో క్రీజ్‌లోకి వచ్చిన కోహ్లి(5) మరోసారి విఫలమయ్యాడు. 8 బంతుల్లో ఒక ఫోర్ కొట్టిన అనంతరం కోహ్లి టపెవిలియన్ బాట పట్టాడు. ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో్సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు విరాట్.

### ఆకట్టుకున్న అయ్యర్

కోహ్లి ఔటైన తర్వాత సెకండ్ డౌన్‌లోక్రీజ్‌లోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ ఆకట్టుకున్నాడు. రోహిత్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. ఒకవైపు రోహిత్ దూకుడుగా ఆడుతుంటే అయ్యర్.. స్ట్రైక్‌రొటేట్ చేస్తూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ జోడి 70 పరుగులు జోడించిన తర్వాత రోహిత్ మూడో వికెట్‌గా ఔటయ్యాడు.లివింగ్ స్టోన్ బౌలింగ్ లో భారీ షాట్ ఆడబోయి రషీద్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దాంతో 220 పరుగుల వద్ద రోహిత్ రూపంలో టీమిండియా మూడో వికెట్ ను కోల్పోయింది. రోహిత్ ఔటైన స్వల్ప వ్యవధిలోనే అయ్యర్ సైతం పెవిలియన్ చేరాడు. 47 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 44 పరుగులు చేసిన అయ్యర్..రనౌట్ అయ్యాడు.

### నిరాశపరిచిన రాహుల్.. మెరిసిన అక్షర్

ఫోర్త్ డౌన్ లో బ్యాటింగ్ కు వచ్చిన కేఎల్ రాహుల్ మరోసారి నిరాశపరిచాడు. 14 బంతుల్లో 1 ఫోర్ సాయంతో 10 పరుగులు చేసిన రాహుల్.. జెమీ ఓవర్టాన్ బౌలింగ్ లో సాల్ట్ కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అక్షర్ పటేల్ మాత్రం బ్యాటింగ్ లో మెరిశాడు. ఆడపా దడపా షాట్లుకొడుతూ నిలకడగా బ్యాటింగ్ చేశాడు. 43 బంతుల్లో 4 ఫోర్లతో41 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు అక్షర్.

అంతకుముందు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్(26), బెన్ డకెట్(65)లు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. ఈ జోడి 81 పరుగులు జత చేసిన తర్వాత సాల్ట్ తొలి వికెట్ గా పెవిలియన్ చేరాడు. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో రవీంద్ర జడేజాకు క్యాచ్ ఇచ్చి సాల్ట్ ఔటయ్యాడు. అనంతరం జో రూట్ తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందకు తీసుకెళ్లాడు డకెట్. అయితే వీరి భాగస్వామ్యం ఎంతో సేపో నిలవలేదు.

## రెండో వన్డే: హిట్‌మ్యాన్ వీరవిహారం

టీమిండియా కెప్టెన్, ఓపెనర్ రోహిత్ శర్మ వీరవిహారం చేశాడు. చాలాకాలం తర్వాత బ్యాటింగ్‌లో చెలరేగిన రోహిత్.. సెంచరీతో మెరిశాడు. గత కొంతకాలంగా ఫామ్ కోసం తంటాలు పడుతున్న హిట్ మ్యాన్.. తిరిగి సత్తా చాటాడు. తనపై వరుసగా వస్తున్న విమర్శలకు బ్యాట్‌తోనే సమాదానం చెప్పాడు రోహిత్. 76 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్స్‌లతో తనదైన శైలిలో రెచ్చిపోయి శతకం పూర్తి చేసుకున్నాడు. సిక్స్ కొట్టి సెంచరీ పూర్తి చేయడం విశిషం. ఇది రోహిత్‌కు 18 నెలల తర్వాత వన్డేల్లో తొలిసారి సెంచరీ.

కటక్‌లో జరుగుతున్న రెండో వన్డేలో ఇంగ్లండ్ నిర్దేశించిన 305 పరుగుల టార్గెట్ ను ఛేదించే క్రమంలో ఓపెనర్‌గా దిగిన రోహిత్,.. సొగసైన ఇన్నింగ్స్ ఆడాడు. శుభ్‌మన్ గిల్(60బీ 52 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) తో కలిసి భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ జోడి తొలి వికెట్‌కు 135 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన తర్వాత గిల్ తొలి వికెట్‌గా




పెవిలియన్ చేరాడు. ఆ తరుణంలో క్రీజ్‌లోకి వచ్చిన కోహ్లి(5) మరోసారి విఫలమయ్యాడు. రోహిత్ సెంచరీ చేసే సమయానికి టీమిండియా ఇంకా 119 పరుగులు చేయాల్సింది ఉంది. రోహిత్‌కు జతగా శ్రేయస్ అయ్యార్ క్రీజ్‌లో ఉన్నాడు. ఇది రోహిత్‌కు 32వ వన్డే శతకం.

అంతకుముందు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్(26), బెన్ డకెట్(65)లు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. ఈ జోడి 81 పరుగులు జత చేసిన తర్వాత సాల్ట్ తొలి వికెట్ గా పెవిలియన్ చేరాడు. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో రవీంద్ర జడేజాకు క్యాచ్ ఇచ్చి సాల్ట్ ఔటయ్యాడు. అనంతరం జో రూట్ తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందకు తీసుకెళ్లాడు డకెట్. అయితే వీరి భాగస్వామ్యం ఎంతో సేపో నిలవలేదు. డకెట్‌ను రవీంద్ర జడేజా పెవిలియన్ కు పంపాడు.

ఆపై బ్రూక్(31), జాస్ బట్లర్(34)లు కాస్త ఫర్వాలేదనిపించారు. జో రూట్ 72 బంతుల్లో 6 ఫోర్ల సాయంతో 69 పరుగులు చేసి ఇన్నింగ్స్,ను చక్కదిద్దాడు. ఆఖరి ఓవర్ వరకూ లివింగ్‌స్టోన్(41) ఉండటంతో ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 304 పరుగులు చేసింది. టీమిండియా బౌలర్లలో రవీంద్ర జడేజా మూడు వికెట్లు సాధించగా, షమీ, హర్షిత్ రానా, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తిలకు తలో వికెట్ దక్కింది.

# జిల్లాకు రూ. 1 కోటి చొప్పున... అభివృద్ధి నిధులు ఇవ్వనున్న హెచ్‌సీఏ

## అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయం



ప్రతిభ గల యువ క్రికెటర్లను ప్రోత్సహించేందుకు త్వరలోనే తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్)ను నిర్వహిస్తామని... హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు వెల్లడించారు. శనివారం ఉప్పల్ స్టేడియంలో జగన్‌మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీఏ అధ్యక్షుడు మాట్లాడుతూ... 'క్రికెట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఐపీఎల్ అనంతరం యువ క్రికెటర్ల కోసం టీపీఎల్ నిర్వహిస్తాం. ఉమ్మడి 10 జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి కోటి రూపాయల చొప్పున ఖర్చు చేయనున్నాం. ప్రతి జిల్లాలో ఒక చోట 10 ఎకరాల స్థలం కొనుగోలు చేసి కొత్త మైదానాలను నిర్మిస్తాం. దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్న తెలంగాణ ప్లేయర్లను సత్కరించేందుకు వచ్చే నెలలో హెచ్‌సీఏ అవార్డులు అందిస్తాం. బీసీసీఐ నిబంధనలకు అనుగుణంగా ఉప్పల్ స్టేడియాన్ని ఆధునీకరిస్తాం.

మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థను అభివృద్ధి పరుస్తాం' అని వెల్లడించారు. ఈ సమావేశంలో హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, కార్యదర్శి దేవ్‌రాజ్, కోశాధికారి శ్రీనివాస్, బసవరాజు, సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా మేనేజర్‌గా ఎంపికైన దేవ్‌రాజ్‌ను అపెక్స్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు.